# బుచ్చిబాబు రచనల్లో కనిపించే 'జీవనకళ'

~ డా. రాయదుర్గం విజయలక్ష్మి



**వ్యాసం:** బుచ్చిబాబు రచనల్లో కనిపించే 'జీవకళ'

**రచన:** డా. రాయదుర్గం విజయలక్ష్మి

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: డిసెంబరు 2013

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=414

©Author.
**What can you do with this document?**
Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use
**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# బుచ్చిబాబు రచనల్లో కనిపించే 'జీవకళ'

"సంతోషం సంచలనాత్మకమైనది. సంచలనాత్మకమైనదానికెప్పుడూ అవతలి పక్షం వుంటుంది. సంతోషం జారిపోతే దుఃఖం కలుగుతుంది, కాని హృదయపు లోతుల్లోంచి జన్మించే సంతృప్తికి దీటైనది ఏదీ లేదు" -- అంటూ జీవిత పారమార్థిక లక్ష్యం సంతృప్తి సాధనే అని సూత్రీకరించిన బుచ్చిబాబు అసలు పేరు, శివరాజు వెంకట సుబ్బారావు. 1916 జూన్ 14వ తేదీన ఏలూరులో జన్మించిన బుచ్చిబాబు, ఆంగ్ల సాహిత్యంలో ఎమ్.ఏ చేసి, అనంతపురంలో, విశాఖపట్నంలో కొన్నాళ్ళు ఆంగ్లభాష అధ్యాపకులుగా ఉద్యోగం చేసి. 1948 నుండి 1967 దాకా ఆలిండియా రేడియోలో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ గా పనిచేశారు.

తండ్రి ఉద్యోగ్యరీత్యా పెక్కు ప్రాంతాలాలో విద్యాభ్యాసం చేసినందువల్ల, చిన్న నాటినుండి అలవాటైన లోకాన్ని పరిశీలించే తత్వం వీరిచేత కలం పట్టించింది. తమలోని సందేహాలకు జవాబులను పుస్తకాల్లో వెదుక్కునే అలవాటున్న వీరు, రచనావ్యాసంగం ప్రారంభించిన నాటినుండి, పుస్తక రచన పుస్తక పఠనాల ఆధారగా జీవితాన్ని శోధించిన నిరతర సాధకుడు. అందుకనే తనదంటూ ప్రత్యేక ముద్రతో తెలుగు సాహిత్య క్షేత్రాన్ని కథలతో, సాహితీ వ్యాసాలతో, నాటకాలతో పండించడమే గాక, తనలోని సర్వ శక్తులను మేళవించి, 'చివరకు మిగిలేది ' అన్న ఒకే ఒక్క నవలను రచించి, సాహిత్య లోకంలో అగ్రశ్రేణిలో నిలవగలిగారు. బుద్ధి జీవి అయిన మానవుడు నిర్దేశిత నియమ బంధాలున్న సమాజంలో ఎదుర్కొంటున్న మానసిక స్థితిగతులను ప్రతిఫలింపజేసే ప్రయత్నం యీ నవలకు ప్రాణనాడి. ఇదే వీరి యితర రచనలన్నిటిలోను సాగిన అంతస్సూత్రం కూడా!

వ్యక్తిని కేంద్రంగా తీసుకుని కనిపించే సమాజం, ఆ వ్యక్తిని శాసించి, తన గుప్పెట్లో పెట్టుకోవాలని ప్రయత్నిస్తుంది. ఆ సమాజం లో జీవిస్తూనే, మానసికంగా సమాజాన్ని దూరంగా ఉంచుతూ వ్యక్తి ఎదగడమే జీవితానికి అర్థం. "వ్యక్తి సంఘాన్ని మార్చలేడు. మనుష్యుల్నీ మార్చలేడు. మారిస్తే బాధ, పగ, యుద్ధం! తనలో తాను సమాధాన పడాలి. మంటను చల్లార్చే మంచుకాలప్రవాహాన్ని హృదయంలో నిలుపుకున్నపుడే ప్రశాంతతను పొందగలడు. పిచ్చి ప్రపంచాన్ని దయతో దూరంగా వుంచే ఔదార్యం అన్నిటికీ అతీతంగా పొందగలిగే సంతృప్తి మనిషికి అవసరమంటారు వీరు!

"మనిషికీ మనిషికీ మధ్య లోనే కాదు గోడలుండటం. ప్రతి మనిషి లోనూ ఒక పల్చటి పొర వుంటుంది.ఆ తెర ఊడిపోకుండా సంఘం కాపలా కాస్తుంటుంది." అంటూ నిర్హేతుకమైన దయను చూపే సమాజంలో ఉంటూనే సౌందర్యమంతంగా జీవితాన్ని మలుచుకోగలిగిన జీవన కళను వీరు అన్వేషించారు. "ఆర్థిక సాంఘిక చారిత్రిక వ్యత్యాసాలకు అతీతమై, మనిషినీ మనిషినీ స్నేహపాశంతో బంధించివేసే మానవత్వంయొక్క శక్తుల్ని అనుభూతమొనర్చుకోగలమేగాని, మాటల్లో వివరించలేము" అంటూ మనుష్యులమధ్య స్నేహం అవసరం అంటారు.

"జీవితం అంటే ఏమిటి?" -- అని ప్రశ్నించుకొని, అదొక నిరంతరమైన అన్వేషణ అంటారు. ఎందుకంటే జీవన రహస్యాలను తెలుసుకున్న వ్యక్తి అన్వేషణ మానలేదు. అలా మానితే జీవితాన్ని అర్థం చేసుకున్న వాడు కాదు, అందుకే జీవితం అంటే ఆలోచనల మయం కాదనీ, అది నిరంతర అనుభూతికీ సంబంధించిందనీ, అనుభూతిని వ్యక్తం చేయలేము కాబట్టి, అన్వేషణ నిరంతరంగా సాగవలసిందే నని అంటారు బుచ్చిబాబు.

బుచ్చిబాబు జీవిత విశేషాలను సమగ్రంగా తెలిపే గ్రనంథమేదీ లేదు. ' నా అంతరంగ కథనం ' అన్న పేర పదిహేనేండ్ల క్రితం బాల్య స్మృతులకు సంబంధించి ఆయన వ్రాసుకున్న జ్ఞాపకాలు మాత్రమే మనకు మిగిలాయి. ఆయన వ్యక్తిత్వం ఆదినుంచీ పుస్తకాల వల్ల ప్రభావితమైనవే ! ఠాగూర్ 'రెక్' నవల, చలం కథలు, కృష్ణశాస్త్రి గేయాలు, ఎంకి పాటలతో బాటు థామస్ హార్డీ, షెల్లీ, కీట్స్, వర్డ్స్ వర్త్. టెన్నిసన్, టాల్ స్టాయ్, మున్నగు వారి రచనలు జీవితాన్ని పరిశీలించడాన్ని నేర్పితే, రస్సెల్, షా, మార్క్స్, డా. సర్వేపల్లి రాధాకృష్ణన్, జిడ్డు కృష్ణమూర్తి రచనలతోబాటు భగవద్గీత -- వీరిలో తాత్విక దృక్పథానికి నారు పోసింది. షేక్స్పియర్ నాటకం హామ్లెట్, సాహిత్యం విలాసం కోసం కాదనీ జీవిత విధానాన్ని నిర్ణయించడంలో సాహిత్యానికి ప్రధానస్థానం వుందనీ వీరికి నేర్పింది. తీవ్రమైన ఆలోచనలను రేకెత్తింపచేయగల ఏ మేధావి భావాలైనా వీరిని ఆలోచింపచేశాయి. మనిషికీ, సమాజానికీ వున్న సంబంధాన్నిగూర్చి అన్వేషింపచేశాయి.

"తనకేం కావాలో తెలీనప్పుడు మానవుడు ద్వేషిస్తాడు. ఏం కావాలో తెలిస్తే, ఆ వొస్తువును ప్రేమించి, దాన్ని పొందడం కోసం యత్నిస్తాడు. తెలీనప్పుడు హృదయంలో మిగిలేది ద్వేషం. అక్కర్లేదని తెలుసుకుంటే మానవులకు ద్వేషం ఉండదు." అంటూ గుర్తించారు, బుచ్చిబాబు.

మానవుణ్ణి జీవితానికి కట్టి పడేసేది కన్నీరు ఆద్యంతాలున్నది కన్నీరొకటే, దానికి అతీతమైన నాడు వ్యక్తి వర్తమానం లో జీవించడం నేర్చుకుంటాడు, అంటారు వీరు. సత్యాన్వేషణలో క్రమపరిణామం అంటే ఆలోచనల స్థాయి నుండి అనుభూతి స్థాయికి రావడమే అని గుర్తించిన వీరు, గతాన్ని తెంపుకున్న వ్యక్తి మత్రమే వర్తమానంలో జీవించగలడు అని గుర్తించారు.

"చివరకు మిగిలేది" లో దయానిధి వ్యక్తిగా మేధావి. కాని అతని తల్లి యొక్క గత జీవితాన్ని గుర్తు చేసి, సమాజమతడిని బాధిస్తుంటుంది. అతని మీదఈర్ష్య పడిన వారికి, అతడిని బాధించేందుకు యిదొక గొప్ప ఆయుధం. తల్లి మీద ప్రేమతో తండ్రికీ, అన్నకూ, దూరమయి, ఏలూరు లో డాక్టరుగా ప్రాక్టీస్ మొదలు పెట్టాడు, దయానిధి. అక్కడి నుండి రాయలసీమకు వెళ్ళి మానవ సేవలో నిమగ్నుడయినాడు. అతని ప్రస్తుత జీవితాన్ని తల్లి శీలంతో ముడి వేసి చివరకు ఈర్ష్యతో ఆస్తిని తగులబెట్టిన ఆ సమాజం నుండి దూరంగా సాగాడు. "జీవితమంటే ఏమిటి?" అని అన్వేషణ ప్రారంభించిన దయానిధి, "జీవితమంటే తనలో తాను సమాధాన పడటం", అన్న సత్యాన్ని తెలుసుకోవడానికి, చాల సఘర్షణే పడవలసి వచ్చింది. గతమనే గట్టిబంధంనుండి విడివడితే తప్ప, మనిషికి విముక్తి లేదు. గతము భవిష్యత్తు వర్తమానాన్ని నిరంతరం హత్య చేస్తుంటాయి. ఆ రెండింటి గురించిన ఆవేదనలో మనిషి వర్తమానంలో జీవించడం మర్చిపోతాడు. అందుకే గతాన్ని తెంపుకుని తనలో తాను సమాధాన పడుతూ వర్తమానంలో జీవించడమే నిజమైన జీవన కళ అనేదే యీ నవల అందించే సందేశం. జీవితాన్ని యింతగా శోధింపగజేసిన నవల కాబట్టే, ఈ నవలా రచన తరువాత దాదాపు కొంతకాలం దాకా బుచ్చిబాబు మరే రచనా చేయలేక పోయారట!

చిత్రకళను కూడాఅభ్యసించిన బుచ్చిబాబు గొప్ప సౌందర్యాన్వేషి! సౌందర్యం ఒక్కసారి అనుభూతికి వచ్చిందా, అది నిత్యనూతనంగా మనలో ఆవిష్కృతమౌతుందన్నది వీరి నమ్మకం. సౌదర్యం అంటే అనుభవించడంకాదనీ, శరీరం ఆత్మ అంటూ కాక, ద్వంద్వాతీతంగా అనుభూతినిచ్చేదని వీరంటారు. సౌందర్యానుభూతిగలవారు జీవితాన్ని నవనవోన్మేషంగా దర్శింపగలరని వీరి అభిప్రాయం! ఈ అంశాన్నే, " ఇప్పటి పావురం - రేపటి నెమలి' అన్న కథలో కామేశం, తమ ఇంట అద్దెకు దిగిన యువ జంట రామ్మూర్తి, కుమారిల వలన తమ జీవితాన్ని సౌందర్యమంతంగా దిద్దుకోవడం, "అనురాగ ప్రస్తారం" అన్న కథలో తన భార్యలాగా

వుందని అందరూ అనే శోభాసుందరిని చూచిన తరువాత, తన భార్య కామాక్షిలో అంతకు పూర్వం తాను గమనించని సౌందర్యాన్ని ప్రసాద్ గమనించడం వంటివి నిరూపిస్తాయి.

ప్రేమించి శారీరిక సుఖం కోరని, ఆనందానుభూతికి మంచి ఉదాహరణ "నన్ను గురించి కథ వ్రాయవూ?", " పొగలేని నిప్పు" అన్న రెండు కథలు. వాంఛకూ, ప్రేమకూ భేధం లేదంటారు వీరు. ఆలోచన, మెదడు, తర్కం, బుద్ధి, విచక్షణ మొదలైన వాటికి అతీతమైనదిగా ప్రేమను గుర్తించిన వీరు, సత్యం, దయ, హృదయలాలిత్యం, ప్రేమ, సౌందర్యం-- ఈ అన్నిటినీ సమానంగా చూడాలంటారు.

"ఏ తప్పూ చేయని మన గురించి ఊళ్ళో వాళ్ళు ఏదో అనుకుంటే మనమెందుకు మంచిగా ఉండాలి?" అని ప్రశ్నించుకుని ఉద్రేకం ప్రదర్శిస్తూ, ఎప్పటికప్పుడు తనను తాను నిగ్రహించుకుంటూ వచ్చిన భాస్కరం, భాధ్యతలన్నీ తీరిన జీవితపు చరమ ఘట్టం లో -- ప్రేమను వాంచగా మార్చుకున్న ఘట్టంలో-- హఠాత్తుగా మరణాన్నే పొందాడు. " పొగలేని నిప్పు" అన్న యీ కథలో యీ అంశం కరుణరసాత్మకంగా చిత్రింపబడిన తీరు బుచ్చిబాబు రచనా శిల్పానికీ, జీవన తాత్వికతకూ గొప్ప ఉదాహరణ! మంచిని దగ్గరకు రానిచ్చి, చెడును రానీయక పోవడం అనే విషయంలో పట్టింపులు చూపని తత్వం బుచ్చిబాబుది. 'నేనెందుకు మంచివాడుగా ఉండాలి?' అని ప్రశ్నించుకుని చెడి పోవాలని ప్రయత్నించినా చెడి పోలేని పాత్ర, " తనను గురించిన నిజం " కథలోని రామ్మూర్తి! జీవితానుభూతిని, జీవనతాత్వికతను తెలుసుకున్న వ్యక్తి మంచి చెడులన్న ద్వంద్వాలకు అతీతుడని, అందుకే అతడు చెడు మార్గంలో పోలేదని నిరూపించారు.

తల్లి, తండ్రి, సమాజం, చిన్నారుల మనసులను తెలుసుకోలేక, " పెద్దదానివి, నువ్వే సర్దుకు పోవాలి..." వంటి మాటలతో పసి మనసులకు చేసే గాయాలను , పెద్దవారైన తరువాత వారి జీవితాలపై ఆ గాయాలు ఎటువంటి చెడు ప్రభావాన్ని చూపగలదో తెలిపే, " ముందు వెనుకలు మిథ్య – చిన్న పెద్దలు తథ్యం" అన్న కథ, కవలపిల్లల పుట్టుకలోని శాస్త్రీయ సత్యాన్ని వివరిస్తూనే, మరో వైపు ఫ్రాయిడ్ చెప్పిన మనో వైజ్ఞానిక చైతన్యాన్ని విశదీకరించే ప్రయత్నం చేస్తుంది.

జేమ్స్ జాయిస్ ప్రభావం తో, Stream of Consciousness ఆధారంగా రచింపబడిన వీరి మరో కథానిక ' చైతన్య స్రవంతి ' అన్న కథ! బుద్ధి జీవి అయిన వ్యక్తి మనస్సులో అస్తవ్యస్తంగా చెలరేగే ఆలోచనలను తెలుపుతుంది,యీ కథ! ఇంటర్వ్యూకి వెడుతున్న వ్యక్తి, ఆధునిక

నాగరికతను వెక్కిరించడం, జీవితంలో అందుకోలేని వాటిని విమర్శించడం... వంటి వాటితో కూడుకున్న యీ కథలో కూడా సమాజాన్ని దూరంగా వుంచుతూ, వ్యక్తి సాగించే ప్రయాణాన్ని నిరూపించే ప్రయత్నం చేస్తుంది.

పాఠకుణ్ణి తనవైపు లాక్కుని , లొంగదీసుకుని రచయిత అంతరంగ జగత్తులోకి ప్రవేశింపచేయడం , శైలి లక్ష్యం అని అభిప్రాయపడిన బుచ్చిబాబు, పాత్రలను పూర్తిగా విశ్లేషించరాదన్న మనో వైజ్ఞానిక శాస్త్ర లక్షణాన్ని ఆదరించే వారు. ఒకరికొకరు సులభంగా అర్థం కాకపోవడం లోనే ఒక వైచిత్రి ఉందని వీరి అభిప్రాయం. ఈ లక్షణమే వీరి పాత్రలను సులభంగా అర్థం కానీయక అంత దూరంలోనే నిలబెడుతుంది. ఈ లక్షణమే వీరి రచనల్లో జీవితాన్ని గాఢంగా దర్శింపజేస్తుంది. " చివరకు మిగిలేది " లో దయా నిధి, " ఆ వాడిన ఆకు" ల్లో చంద్ర కాంత, " ఎల్లోరాలో ఏకాంత సేవ" లో మధు సూదనం, దీనికి ఉదాహరణలే!

"కేవలం వర్ణనలు, సంఘటనా వివరాలతో కథ సమకూడదు. దానితో బాటు కథకి హృదయం, ఉద్రేకం, ఇంద్రియజ్ఞానంతో ముడిపడిన తృష్ణ కూడా కావాలి" అనే బుచ్చిబాబు, " స్నేహాలకూ ఆంతరంగికాలకూ యీ యుగం లో తీరుబడి లేనట్లుంది. అంతా తలో కెరటమై, ఎక్కడికో కొట్టుకు పోతున్నారు." వంటి జీవితం గూర్చిన వ్యాఖ్యానాలతోబాటు జీవితాన్ని గూర్చి చలోక్తులను కూడా విసరగల నేర్పరి.

ఆరోగ్యదాయకమైన హాస్యం, వ్యగ్యం, అధిక్షేపం .. సమపాళ్ళలో మేళవించిన వస్తు వైవిధ్యంతో రచనలు చేసిన బుచ్చిబాబు, మానవుల స్వభావాలను పరిశీలిస్తూ, జీవన తాత్విక చింతనలో మునిగి తేలుతూ జీవితాన్ని సౌందర్యమంతంగా, కళాత్మకంగా మలుచుకున్న సత్యాన్వేషి. అందుకే జీవన రహస్యాలను గాంచడంలో నాలుగో పరిణామం సాహిత్యం" అని నమ్మిన వీరి రచనలు, జీవన సౌందర్యాన్ని అనుభూతమొనర్చుకుంటూ, గతాన్ని వదలి వర్తమానం లో జీవిస్తూ, ఈర్ష్యాపూరిత సమాజాన్ని దయతో దూరంగా వుంచుతూ, సాటి మనిషితో స్నేహానుభూతిని పంచుకుంటూ, తనతో తాను సమాధాన పడుతూ అన్వేషణ సాగించడమేజీవితానికి అర్థం అని చెబుతాయి.

---

For Latest Telugu Books - Visit now:
Kinige.com